# ఉణ్ణై నాన్ కాదలిక్కరెన్

కథ

గోపరాజు రాధాకృష్ణ

నాకు బాగా గుర్తు. ఫిబ్రవరి తొమ్మిది.

జీవితంలో ఎవరికి ఏ టైములో ఏది తెలియాలో వాళ్లకి అప్పుడే అది తెలుస్తుందనీ తెలిసొస్తుందనీ నాకర్థమైన రోజు. తనకి నా ప్రేమ సంగతి చెప్పిన రోజు. అప్పటి వరకు ప్రేమ మనసులో చేసే అల్లరి గురించీ అలజడి గురించీ నాకు తెలీదు. తన మీద ప్రేమే నేర్పింది.

ఓ గంట రకరకాల హావభావాలతో బాగా సాధన చేసి చెప్పాను. అదేదో సినిమాలో చెప్పినట్టు, అవుననో కాదనో ఏదో ఒకటి అనాలి కదా! అదేం లేదు. కాదనీ అన్లేదు. ముఖంలో ఏ కవళికా లేదు.

మళ్లీ చెప్పాలనుకున్నాను. ప్రియురాలు సంగతి దేవుడెరుగు... అసలు స్నేహమే బెడిసికొండుతుందేమోననిపించి విరమించుకున్నాను.

ఇంకా... అంది తను! ఆ విషయం మాట్లాడ్డం ఇష్టం లేనట్టు.

తనంతే. మాటల్లోకి ఇష్టంలేని విషయం చొరబడినప్పుడు ఈ పదం వాడి, మాట మారుస్తుంది.

ఇలాంటి అనుభవం మా పరిచయం జరిగిన మొదటిరోజే నాకు ఎదురైంది. అప్పుడు నేనడిగిన ప్రశ్న కూడా ఆ మాట అనదగ్గదే. మామూలుగా ఎవరైనా కొత్తగా పరిచయం అయితే పేరడుగుతారు. నేనలా కాదు. ఈ గిరజాల జుట్టమ్మాయిని మొదటిసారి చూడగానే పిచ్చపిచ్చగా నచ్చడం వల్ల, మనసులో ఏదో రసాయన చర్య జరగడం వల్ల, ఆ అమ్మాయి నవ్వితే గుండె గులాబీలా ఊగడం వల్ల 'మిమ్మల్ని ఇంట్లో ఏ పేరుతో పిలుస్తారు?' అని అడిగాను. ఇది అనుకొని అడిగింది కాదు. ఏదో అలా అడగాలనిపించింది. అడిగేశాను.

'ఇంకా' అని ఈ అమ్మాయి మొహం ఎలాగో పెట్టేసరికి నాకు విషయం అర్థమైపోయింది...

తర్వాత కూడా ఐదారు 'ఇంకా'లు మా మధ్యకొచ్చాయి. ఇప్పుడీ ఇంకో 'ఇంకా'.

నా ప్రేమని తను పెద్దగా పట్టించుకున్నట్టు లేదు. మామూలుగా మాట్లాడుతోందిగానీ అసలు విషయం తెల్చట్లేదు. పోనీ అడుగుదామా అంటే ధైర్యం చాలట్లేదు.

ఈ గిరజాల జుట్టమ్మాయి ఏం పట్టనట్టు ఉండగలుగుతోంది. గానీ నేను మాత్రం ప్రేమ సంగతిని తీసిపడెయ్యలేకపోతున్నాను. తనకి ఇష్టం లేదేమోనన్న ఆలోచన ఒక పక్కన... తనకి దూరం అవుతానేమోనన్న బెరుకు మరోపక్క...చిన్న గొడవ మనసులో.

ఏ మాటకి ఆ మాటే చెప్పుకోవాలి...

తనని మొదటిసారి చూసినప్పటినుంచి ఇప్పటి వరకూ చూసిన ప్రతిసారీ ఒకే 'ఇది'...

నా మనసులో సగం ఓ అందమైన అమ్మాయి రూపంలో నా ముందే తిరుగుతున్నట్టు...!

తియ్యటి భావన.

అందుకే తను నా ప్రేమ గురించి ఏం మాట్లాడకపోయినా పట్టువదలని విక్రమార్కుడిలా మాటల కోసం ప్రయత్నిస్తునే ఉన్నాను. ఒకవేళ సారీ అబ్బాయ్ అని చెప్తే సైలెంట్‌గా సైడ్ అయిపోదామని ఆలోచించాను. ఏం చెయ్యాలా అనే ప్రశ్నతో రెండో మూడో నిద్రలేని రాత్రులయ్యాకా ఓ ఆలోచనొచ్చింది. ఇట్నుంచి వర్కవుట్ కావట్లేదు గనక... అట్నుంచి నరుక్కొచ్చే ఫార్ములా ప్రయత్నిద్దామనుకున్నాను. మర్నాడు తను కనబడింది. నవ్వింది. గుండె గడియారం లోలకంలా అటూ ఇటూ ఊగింది.

నేనేం చెప్పనట్టు, తనేం విననట్టు...



అసలు మా ఇద్దరి మధ్యా మాటలేవీ జరగనట్టు ఉంది తను.

అది ఎలా ఉండగలుగుతోంది? హృదయం లేని ప్రియురాలు!

తనని చూసి నేను ఆగాను... నన్ను చూసి తనూ ఆగింది. నిన్ను నేను ప్రేమిస్తున్నాను అని తమిళంలో ఎలా చెప్పాలి? ఇదీ నా క్వశ్చన్. నిజానికి, తమిళ ఫ్రెండెవర్నయినా అడగొచ్చు. తన నోటినుంచి వినాలని ఆశ. నేన డగడం ఇంకా పూర్తి కానేలేదు. అవతల్నించి ఇంకో పదం దూసుకొచ్చింది.

'ఇంకా...?'

ఇంకా ఏంటి నా మొహం?

ముందు కాసేపు బాధేసినా, ఆలోచించగా చించగా ఓ విషయం స్పష్టమైంది. తనకి తమిళం, తెలుగు రెండూ తెల్సు. కేవలం అనువాదంలా అయితే వెంటనే చెప్పేసేదే. కానీ చెప్పడానికి మొహమాటపడుతోంది. అంటే... నేనంటే ప్రేమ ఉన్నట్టేనా? ఏమో! మరి ఉంటే చెప్పడానికేంటి? మళ్లీ ఏమో! నేను ఇంకా ఇంకా అంటుంటే ఈ అమ్మాయేంటి ఇంకా అంటుంది? పిచ్చెక్కుతోంది.

అసలీ అమ్మాయి గురించి కొంచెమైనా తెల్సుకోవాలని కోసం ఆ అమ్మాయి కుర్చీ దగ్గరకెళ్లి చూశాను.

అక్కడ వాతావరణం ఎంతో రొమాంటిక్‌గా ముచ్చటగా ఉంది. బుజ్జిపాపాయి అద్దంలో తన బొమ్మని ముద్దు పెట్టుకుంటున్న బొమ్మ బోర్డ్‌పైన గుచ్చి ఉంది. పక్కనే గులాబిరంగు కాగితం ముక్క గాలికి సుతారంగా ఒయ్యారంగా ఊగుతోంది.

'నేనంటే... ఇంకో నువ్వు!' ...అని రాసుంది. రాత తనదే అనుకుంటా. చాలా బావుంది.

మంచి టేస్టున్న అమ్మాయిలా ఉంది.

తను ఎటూ తేల్చని సందిగ్ధంలో రోజులు వెళ్లిపోతున్నాయి. మళ్లీ ఇంకో ఆలోచనొచ్చింది.

కవిత్వం రాయాలి... తప్పదు... నాలో కవి నిద్ర లేవాల్సిందే. ఇదే సమయం...!

ఏదో రాయాలనిపిస్తుంది... ఏం రాయాలో తెలుసు. పెన్ను పట్టుకొని కూర్చుంటే మాత్రం ఒక్క మాటా ఊడిపడదు. అలా నాల్రోజులు ప్రయత్నం చెయ్యగా రెండు లైన్లొచ్చాయి.

'... ఈ ప్రపంచానికి నువ్వో అమ్మాయివి మాత్రమే.

ఓ అబ్బాయికి మాత్రం నువ్వే ప్రపంచానివి!'

మర్నాడే ఆ అమ్మాయికి ఇచ్చాను. 'ఇంకా' అన్లేదుగానీ కనుబొమలు ఎగరేసింది. నవ్వింది.

ఫ్రిజ్ తెరిచినట్టు చల్లగా అనిపించింది. కానీ నా రెండు ప్రశ్నల్లో ఏ ఒక్కదానికీ ఆ నవ్వులో సమాధానం లేదు. మనసుని కాగితమ్మీద అక్షరాల్లా పెట్టి ఇస్తే దానికేం సమాధానం లేదుగానీ- ఓ వారం తరవాత అడిగింది. కొత్తగా కవిత్వం రాయలేదా? అని.

ఈ అమ్మాయి అక్షరాల్నే ఎందుకు [illegible]...మ్మని చూడకుండా! తల అడ్డంగా ఊపాను లేదని. ఎంత గింజుకున్నా ఒక వైపే. రెండోవైపు పెద్ద సున్నా.

మళ్లీ ఓ నిద్రలేని రాత్రిని గడిపి, తనకి ఇష్టం లేదేమోనని ఆగిపోయాను. ఎందుకు అనవసరంగా ఇబ్బంది పెట్టడం! ఈ అమ్మాయి, నేను ఒక చోట పనిచేస్తున్నాం- అంతవరకే!

చాలా పేలవంగా రోజులు గడుస్తున్నాయి. ఆ అమ్మాయి కనిపించడం మాత్రమే ఆనందంగా సరిపెట్టుకునే పరిస్థితి వచ్చేసింది. రోజూ ఎదురుపడతాం. కొన్ని నవ్వులు... కాసిని మాటలు.

ఓ పదిరోజులకనుకుంటాను... పెళ్లికని రాజమండ్రి వెళ్లాం అందరం కలిసి. డ్రస్సుల్లో అందం చీరలోకి మారింది. అందం చీర కట్టుకున్నట్టుంది. కళ్లు పండగ చేసుకున్నాయి. మేఘాల మీంచి భూమ్మీదికి నడిచొచ్చే దేవకన్యలా, సిరివెన్నెల స్నానించిన శ్రితపారిజాతంలా ఉంది తను. గుండె మరోసారి గడియారం లోలకంలా, గులాబిలా ఊగబోతోంటే... గట్టిగా పట్టుకొని ఆపేశాను. నేరుగా నాలుగుసార్లు, దొంగతనంగా ఓ వందసార్లు చూశాను. చూశాను అని జంటిల్మన్‌లా చెప్పేకంటే- చూడకుండా ఉండలేకపోయానని నిజాయితీగా ఒప్పుకోవడం మంచిది. అక్కణ్నుంచి వచ్చాకా తను చాలా సీరియస్‌గా ఉంది. మాటలేకాదు... పలకరింపులూ లేవు. అమ్మాయిగారికి కోపం వచ్చినట్టుంది! నాతోనే కాదు- అందరితోనూ అలాగే ఉంది.

రెండ్రోజులు కనబల్లేదు. సెలవన్నారు. ఏమైందీ అమ్మాయికి? తర్వాత ఆఫీసుకి వచ్చినా ముఖం ముడుచుకొనే ఉంది. తను అలా ఉండడం చూస్తే నాకే అదోలా ఉంది. ఏప్రిల్ ఇరవై ఒకటి... పెంట్‌హౌస్ బయటకి వచ్చి రాత్రి శూన్యంలోకి చూస్తూ సుదీర్ఘంగా ఆలోచిస్తున్నప్పుడు ఫోన్ మోగింది. తనే...! మనసు కేరింతలు కొడుతోంది...

'నిన్ను నేను ప్రేమిస్తున్నాను అని తమిళంలో చెప్పాలంటే ఉన్నై నాన్ కాదలిక్కిరేన్ అనాలి' వినిపించీ వినిపించనట్టు అరనవ్వు...!

గుండె కరిగి జ్ఞాపకాల జలపాతంలా మనసులోకి జారుతున్నట్టు... టపటపా రెక్కలు కొట్టుకుంటూ ఎదలో వందల పావురాళ్లు రివ్వున గాల్లోకి లేచినట్టు... వెన్నెల్లో గోదావరిని చూస్తూ ఇసుక తిన్నెల్లో తనతో మాట్లాడుతున్నట్టు... సుతిమెత్తని అనుభూతి. ఇంకెందుకు ఆలస్యం? వెంటనే కాల్ చేసి చెప్పేశాను.

'ఉన్నై నాన్ కదలిక్కిరేన్'

సంతోషంగా ఉంది. చాలా. చాలావాలా... ఓ వంద చాలాలు!

వెంటనే సమాధానం ఆశించాను. కానీ రాలేదు. నిమిషాలు... గంటలు... రోజులు... గడుస్తున్నాయి. ఈ అమ్మాయి మాట్లాడట్లేదేంటి? పది రోజులు... కందగడ్డలా మొహం! పదకొండో రోజు... ఆఫీస్‌లో లిఫ్ట్ దగ్గరకి వెళ్తుంటే సెక్యూరిటీ బ్బాయి ఓ కవరిచ్చాడు. తెరిచ్చూస్తే లోపల ఒక తెల్లకాగితం! ఓ మూల చిన్న క్యాప్షన్...

'మీకేం కావాలో అది రాసుకోండి'.

నవ్వొచ్చింది... సంతోషం అనిపించింది. ఓ రెండ్రోజులు మనిషిని కాలేకపోయాను. మర్నాడు అడిగాను.

'ఇవన్నీ ఎందుకు... చెప్పొచ్చు కదా?'

తను 'ఇంకా' అంటుందేమోనని, అడిగేశాకా గానీ స్ట్రయిక్ కాలేదు. కానీ అలా అన్లేదు. 'కొన్నిటిని మాటలతో చెప్పకూడదు... మనసుతో చెప్పాలి...' అంది.

పండగంటే ఎలా ఉంటుందో మనసుకి తెల్సిందా రోజు.

ఆ రోజు నుంచీ ప్రతిరోజై తను కనబడగానే ప్రేమని రంగరించిన నవ్వు... ఆప్యాయత నిండిన పలకరింపు. ఇద్దర్లో ఎవరికి ఎవరితో మాట్లాడాలనిపించినా ఫోను... శనివారం సాయంత్రం ఎక్కడైనా వెళ్లి వారానికి సరిపడా ఓ గంట కబుర్లు...!

ఇది జరిగిన చాన్నాళ్లకి ఓ రోజు తన కుర్చీ దగ్గర్నుంచి వెళ్లాల్సొచ్చింది ఎక్కడికో. బోర్డ్‌పైన పాపాయి బొమ్మకి బదులు వేరే వచ్చి చేరింది. పసుపు రంగు పేపర్‌పైన ఎర్రక్షరాలు....

'ప్రేమంటే- ఒంటరి నడకలో జంటకోసం నిరీక్షించడం

ఏకాంతం రెండు భాగాలై రెండో భాగం కోసం అన్వేషించడం

మనసులోయలో వసంతాలు విరబూయడం'

బావుంది! దానిపక్కనే తెల్ల కాగితం పైన ఆకుపచ్చని అక్షరాలు.

'ఈ ప్రపంచానికి నువ్వో అమ్మాయివి మాత్రమే... ఓ అబ్బాయికి మాత్రం నువ్వే ప్రపంచానివి!'

... నాదే!

తను నేనొచ్చినట్టు గమనించింది గానీ నా వైపు చూపు తిప్పలేదు. తీవ్రంగా పని చేసుకుంటోంది. తనని చూశాను. తన పెదవి చివర్న చిర్నవ్వు!

